జోరందుకున్న వరిసాగు

- ప్రాజెక్టులకు నీటి రాకతో ముమ్మరంగా పనులు
- ప్రారంభమైన కరిగెట పనులు
- కూలీలకు పెరిగిన డిమాండ్


మన్నాపురం శివారులో పొలంలో గొర్రుపాస్తున్న రైతు

ధరూరు: కర్ణాటక, మహారాష్ట్రలో కురిసిన భారీ వర్షాలతో మండలంలోని జూరాల ప్రాజెక్టు నిండు కుంది. తద్వారా ప్రాజెక్టు బ్యాక్ వాటర్ ద్వారా నీటిని తరలించి నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని ఎత్తిపోసి మండలంలోని గుడ్డెందొడ్డి, ర్యాలంపాడు రిజర్వాయర్లు నింపుతున్నారు. సాగు నీటి కోసం ఎన్నో ఆశలతో ఎదురుచూస్తున్న రైతులకు వరద జలాలు ఎంతో ఉపయోగకరంగా మారాయి. వరదజలాల రాకతో అన్నదాత కళ్లల్లో ఒకింత ఆనందం కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో మండలంలో ఖరీఫ్ వరిసాగు జోరందుకుంది.

నెట్టెంపాడు జలాలతో సాగు

మండలంలో దాదాపు సగం గ్రామాలు నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం ద్వారా విడుదల చేసిన నీటి ద్వారానే పంటలు సాగు చేస్తారు. జూరాలకు వరద ప్రారంభం కావడంతో మండలంలో రైతులు పంటల సాగుపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రధాన కాల్వ వెంట ఉన్న జాంపల్లి, మన్నాపురం, ధరూరు, గుడ్డెందొడ్డి, గుర్రోనిపల్లి, దోర్నాల, మార్లబీడు, చెన్నారెడ్డిపల్లి, ర్యాలంపాడు గ్రామాల రైతులు నీటి రాకతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఏటా పెరుగుతున్న వరిసాగు

గతేడాది మండలంలో దాదాపు 20 వేల ఎకరాల్లో వరి పంట సాగు కాగా.. ఈ ఏడాది మరింత పెరిగే అవకాశం ఉంది. ప్రభుత్వం వరికి మద్దతు ధర రూ.2,320తో పాటు క్వింటాల్‌కు రూ.500 బోనస్ కూడా ఇస్తుండడంతో ఇతర పంటలు వేసి ఇబ్బందులు పడేకంటే వరి వేసుకోవడమే మేలంటున్నారు. ఈ నేపథ్యంలో కరిగెట చేసే ట్రాక్టర్లకు డిమాండ్ పెరిగింది. వారం రోజుల్లోనే మండలంలో దాదాపు 2వేల ఎకరాల్లో వరిపంట సాగు పనులు చేపట్టినట్లు వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొన్నారు.


ధరూరు శివారులో నారు తీస్తున్న కూలీలు

కూలీలకు డిమాండ్



వరినాట్లు వేసుకునే పనుల్లో రైతులు బిజీగా ఉన్నారు. ఈసారి వర్షాలు ముందగానే కురవడంతో పంట సాగుకు అనువుగా మారింది. ప్రభుత్వం సబ్సిడీపై ఇచ్చే విత్తనాలు అందుబాటులోకి రాకపోవడంతో బయట మార్కెట్‌లో అధిక రేట్లకు కొంటున్నాం. కూలీలకు బాగా డిమాండ్ పెరిగింది. ఖర్చులు పెరిగిపోయాయి.

\- రైతు దావీదు, ధరూరు

ముందుగానే నీళ్లొచ్చాయి



గతేడాదితో పోలిస్తే ఈసారి ముందస్తుగానే సాగునీళ్లు వచ్చాయి. కాల్వల ద్వారా నీటిని విడుదల చేయడంతో సాగు పనులు మొదలు పెట్టాం. కూలీల కొరత కారణంగా పక్క మండలాలైన కేటీదొడ్డి, గట్టు మండలాల నుంచి కూలీలను తీసుకు వచ్చి నాట్లు వేయిస్తున్నాం. కూలీ రేటు రూ.500 నడుస్తోంది.

\- ఎంటికల సవరప్ప, ధరూరు

క్లుప్తంగా

'స్థానిక' ఎన్నికల్లో సత్తా చాటుదాం



కేటీదొడ్డి: రానున్న స్థానిక సంస్థల ఎన్నికలల్లో బీఆర్ఎస్ సత్తా చాటుదామని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు బాసు హనుమంతునాయుడు అన్నారు. సోమవారం మండల పరిధిలోని గువ్వలదిన్నె గ్రామంలోని పలు పార్టీలకు చెందిన 70 మంది కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైందన్నారు. కార్యక్రమంలో నాయకులు చక్రధర్, వెంకటేష్‌నాయుడు, గాజులపాడు రఘు, మోనేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్యాలయంలో షార్ట్ సర్క్యూట్



అయిజ: మున్సిపల్ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం షార్ట్ సర్క్యూట్ జరిగిన ఘటన సోమవారం వెలుగు చూసింది. ప్రమాదంలో వైరింగ్ మొత్తం కాలి బూడిదైంది. షార్ట్ సర్క్యూట్‌పై అనుమానం ఉందని విచారణ చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ పోలీసులను కోరారు.

ఆలయంలో చోరీకి యత్నం

గట్టు: మండల పరిధిలోని ఇందువాసి గ్రామంలో గుట్టపై నూతనంగా నిర్మించిన ఇంజమ్మవ్వ ఆలయంలో సోమవారం పట్టపగలే ఓ వ్యక్తి హుండీలో డబ్బులు దొంగిలించడానికి ప్రయత్నించగా గ్రామస్తులు పట్టుకున్నారు. అనంతరం గట్టు పోలీసులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



గట్టు: మండల పరిధిలోని గొర్లఖాన్‌దొడ్డి గ్రామంలో సోమవారం భవిష్య భారత్, ఎల్‌టీఐ మైండ్‌ట్రీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారి మురళీధర్ ఆధ్వర్యంలో గ్రామస్తులకు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఏడాది కాలంగా భవిష్య భారత్ స్వచ్ఛంద సంస్థ గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం రాగిణి, సీఈఓ జిలాని, పరమేష్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి



గట్టు: చదువును మధ్యలో ఆపిన విద్యార్థులకు ఓపెన్ ఇంటర్, ఎస్ఎస్‌సీని పూర్తి చేసుకునే చక్కటి అవకాశం ఉందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఉన్నత పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం నర్సింహులుగౌడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఓపెన్ ఇంటర్, ఎస్ఎస్‌సీ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో ఓపెన్ స్కూల్ ఇన్‌చార్జ్ పరుశరాం, ఉపాధ్యాయులు రమేష్ పాల్గొన్నారు.

పొలం విషయంలో ఘర్షణ.. పంట ధ్వంసం

ఉండవెల్లి: మండల కేంద్రంలోని అన్న సాగు చేస్తున్న మొక్కజొన్న పంటను ధ్వంసం చేశాడో ఓ తమ్ముడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన తుముకుంట ప్రభాకర్‌రెడ్డి, రామిరెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి సోదరులు. దానిలో ప్రభాకర్‌రెడ్డి, రామిరెడ్డి కలిసి వారి వాటా ఉన్న 4 ఎకరాల 7 గుంటల భూమిలో మొక్కజొన్న సాగు చేపట్టారు. ఈ క్రమంలో పొలం వాటా విషయంలో ఘర్షణ పడిన తమ్ముడు నాగేశ్వర్‌రెడ్డి ఈ నెల 12న మొక్కజొన్న పంటను దున్నేశాడు. ఈ క్రమంలో తమ్ముడు నాగేశ్వర్‌రెడ్డిపై ప్రభాకర్‌రెడ్డి సోమవారం ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ శేఖర్ పేర్కొన్నారు.

చరిత్రలో ఘనం.. అభివృద్ధిలో శూన్యం


చెన్నిపాడు వ్యూ


గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ డాక్టర్ సృజనతో కరుణాకర్

మానవపాడు: శతాబ్దాల చరిత్ర కలిగిన శాసనాలు, శ్రీకృష్ణదేవారాయుల కాలం నాటి అనవాలు, ప్రాచీన గ్రంథాలయం కలిగిన చెన్నిపాడు గ్రామం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. ఎందరో కవులు, మేధావులు, ముఖ్యమంత్రి, మంత్రులు గ్రామంలో పర్యంటించిన నేపథ్యం ఉంది. పాలకుల నిర్లక్ష్యమో.. అధికారుల అలసత్వమో కానీ అభివృద్ధికి నోచుకోక గ్రామ ప్రజలు అవస్థలు పడుతూనే ఉన్నారు. రెండు అంతరాష్ట్ర, రెండు జాతీయ రహదారులు ఉన్న రోడ్డు మార్గం వర్షం పడిందంటే చాలు కాలినడక తప్పదు. ప్రాచీన కాలం నాటి గ్రంథాలయ స్వర్ణోత్సవాలకు, వజ్రోత్సవాలకు, రజతోత్సవాలకు మాజీ ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి, మంత్రులు, కవులు సి.నారాయణరెడ్డి, కళాకారులు, నాయకులు గ్రామాన్ని సందర్శించిన కనీసం రోడ్లు కూడా మరమ్మతులకు నోచుకోలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త అనంత కరుణకార్ గ్రామంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ డాక్టర్ సృజనకు వినతిపత్రం అందజేశారు. ప్రజలు సమస్యలతో సతమవుతున్నారని గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు.

మాన్యం భూమిలో నిర్మాణాలు ఆపాలి


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

అలంపూర్: దేవుడి మాన్యం భూమిలో నిర్మాణాలను ఆపాలని బీజేపీ నాయకులు కోరారు. జిల్లా కేంద్రంలో కలెక్టర్ సంతోష్‌ను బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు నాయకులతో కలిసి సోమవారం వినతిపత్రం అందజేశారు. మండలంలోని గొందిమల్ల గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయానికి చెందిన సర్వే నంబర్ 199లోని మాన్యం భూమిలో కొందరు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకుంటున్నట్లు వినతిలో పేర్కొన్నారు. దేవుడి మాన్యం భూమిలో నిర్మాణాలను నిలిపివేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు దేవదాసు, ఐటీ సెల్ కన్వీనర్ చిత్తారికిరణ్, మైనార్టీ మోర్చా అధ్యక్షుడు ఆసీఫ్, మండల అధ్యక్షుడు ఈశ్వర్ పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ సభ్యత్వ నమోదు


సభ్యత్వ నమోదు చేపడుతున్న నాయకులు

ఎర్రవల్లి: ఉమ్మడి ఇటిక్యాల మండలాల్లో సోమవారం టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్ ఉపాధ్యాయులకు సభ్యత్వ నమోదు పత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 317 జీఓ ద్వారా నష్టపోయిన ఉపాధ్యాయులను తక్షణమే సొంత జిల్లాలకు పంపాలన్నారు. సీపీఎస్‌ను వెంటనే రద్దు, పెండింగ్ డీఏ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు విజయ్ కుమార్, నాగన్న, తిమ్మప్ప, రాజశేఖర్, కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై వరినాట్లు వేసి నిరసన


కుచినెర్లలో మురుగులో నాట్లు వేసి నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

కేటీదొడ్డి: మండలంలోని కుచినెర్ల గ్రామంలో పారిశుద్ధ్యం లోపించడంతో మురుగు రోడ్లపైనే పారుతుంది. మురుగు సమస్య తొలగించాలని అధికారులకు విన్నవించుకోలేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం రోడ్డుపై వరినాట్లు వేసి నిరసన తెలిపారు. రోడ్డుపై మురుగు నిల్వ ఉండటంతో దుర్గంధం వెదజల్లుతోందన్నారు. దోమలు వృద్ధి చెంది అనారోగ్యం పాలవుతున్నట్లు వాపోతున్నారు. రోడ్డుపై మురుగు ఉండటంతో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాల బారిన పడుతున్నట్లు పేర్కొన్నారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

మానవపాడు: మండల పరిధిలోని ప్రతి ఒక్క రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్‌ను తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి ప్రదీప్‌కుమార్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఫార్మర్ రిజిస్ట్రేషన్‌కు సంబంధించి వ్యవసాయ విస్తరణ అధికారులతో చర్చించారు. నమోదు చేసుకునేలా రైతులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణంపై హైకోర్టు స్టే

గద్వాల: గట్టు గ్రామంలో పంచాయతీ కార్యాలయం వద్ద నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ వివాదం హైకోర్టుకు చేరింది. గట్టుకు చెందిన దేవన్న గట్టు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్ వ్యవహారంపై హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసిన నేపథ్యంలో హైకోర్టు విచారణ చేపట్టింది. ఈ వ్యవహారంపై సోమవారం విచారించిన హైకోర్టు నిర్మాణ పనులు కొనసాగించకుండా స్టేటస్‌కో (యథాస్థితి, స్టే)విధించింది.

బాలలతో పనిచేయిస్తే చర్యలు



మల్దకల్: బడిఈడు పిల్లలను బాలకార్మికులుగా మార్చితే కఠిన చర్యలు తప్పవని ఇన్‌చార్జి ఎంఈఓ సురేష్, లేబర్ అధికారి, ఐసీడీఎస్, సీసీఎస్ హెచ్చరించారు. సోమవారం మండలంలోని పాల్వాయి, మల్దకల్ గ్రామాల్లోని హోటళ్లు, వెల్డింగ్ షాపులు పలు దుకాణాల్లో తనిఖీ చేశారు. పాల్వాయిలో గొర్రెలు మేపుతున్న ఓ బాలకార్మికుడిని గుర్తించి అవగాహన కల్పించారు. బాలలను పనిలో పెట్టుకోకూడదని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీచుపల్లికి చేరుకున్న చైతన్య యాత్ర



ఎర్రవల్లి: హైదరాబాద్‌లోని ఎల్‌బీనగర్ నుంచి కడప జిల్లాలోని బ్రహ్మంగారి మఠం వరకు 450 కిలోమీటర్ల మేర చేపట్టిన విశ్వ బ్రాహ్మణ చైతన్య యాత్ర సోమవారం బీచుపల్లి పుణ్యక్షేత్రానికి చేరుకుంది. రాష్ట్రంలో విశ్వబ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు వారి డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర నాయకులు చేపట్టిన పాదయాత్రకు జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు బీచుపల్లిలో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర నాయకులు వినోదాచారి, నాయకులు మోనయ్య, వెంకటరమనాచారి, వివిధ ఆలయాల పూజారులు, తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్లు మంజూరు చేయాలని వినతి

ఎర్రవల్లి: మండల పరిధిలోని కొండేరులో సీసీ రోడ్లు నిర్మించాలని కోరుతూ కాంగ్రెస్ నాయకులు సోమవారం ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామానికి చేరుకునే రోడ్లు సక్రమంగా లేకపోవడంతో ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆయా రోడ్లకు సీసీరోడ్డు మంజూరు చేయాలని కోరుతూ హైదరాబాద్‌లో ఆయన్ను కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వెంకటేష్, బీచుపల్లి, ప్రతాప్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ వసూళ్లపై విచారణ


రేషన్‌షాపులో విచారణ చేస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

మానవపాడు: రేషన్ సరుకుల పట్టిక పుస్తకం ఇవ్వడం కోసం మండలంలోని కొర్విపాడు గ్రామంలోని డీలర్ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు 'రేషన్ డీలర్ అక్రమ వసూళ్లు' అనే శీర్షికన ఈ నెల 11న శుక్రవారం 'సాక్షి' దినపత్రికలో కథనం ప్రచురితమైంది. సోమవారం స్పందించిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు ప్రశాంత్‌గౌడ్, ఉదయ్‌కిరణ్, మానవపాడు ఆర్ఐ గురురాజ్ కొర్విపాడులోని డీలర్ హీరాబాయి రేషన్ దుకాణంలో విచారణ చేపట్టారు. విచారణ పూర్తి చేసిన అధికారులు మాట్లాడుతూ.. 40కి పైగా రేషన్ సరుకుల పట్టిక పుస్తకం లబ్ధిదారులకు ఇవ్వడం కోసం రూ.150 చొప్పున వసూలు చేసినట్లు లబ్ధిదారులు తెలిపారన్నారు. అనంతరం నివేదికను తహసీల్దార్ జోషి శ్రీనివాస్‌శర్మకు అందించినట్లు తెలిపారు. ఈ సంఘటనపై తహసీల్దార్‌ను వివరణ కోరగా.. ప్రభుత్వ అనుమతులు లేకుండా రేషన్ సరుకుల పట్టిక పుస్తకం కోసం రూ. 150 వసూళ్లు చేయడం చట్ట విరుద్ధమన్నారు. అధికారులు సమర్పించిన నివేదికను ఆర్డీఓ అలివేలుకు పంపుతామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశానుసారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

బకాయి బిల్లులు చెల్లించాలి


డీఈఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న కార్మిక సంఘం నాయకులు

గట్టు: పెండింగ్‌లో ఉన్న మధ్యాహ్న భోజన బిల్లుల బకాయిలను తక్షణమే చెల్లించాలని వంట ఏజెన్సీ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు శేషన్న, సంఘం నాయకులు సోమవారం కలెక్టర్, జిల్లా విద్యాధికారికి వినతిపత్రం అందజేశారు. 4 నెలలుగా మధ్యాహ్న భోజన బిల్లుల బకాయిలు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. గుడ్ల బిల్లులు కూడా పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. మెనూ ప్రకారం పప్పుతో పాటుగా రెండు రకాల కూరగాయలు చేయాలని అంటున్న అధికారులు అందుకు తగినట్లు అదనంగా బిల్లులు చెల్లించాలని కోరారు. వంట కార్మికుల జీతం కూడా పెంచాలని కోరారు. నాణ్యమైన బియ్యాన్ని వంట ఏజెన్సీలకు అందించే విధంగా జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వంట ఏజెన్సీ కార్మికుల సంఘం నాయకులు సుంకన్న, బాష, సుజాత, దేవమ్మ, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి


మన్నాపురంలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీసీఈబీ కార్యదర్శి ప్రతాప్‌రెడ్డి


గువ్వలదిన్నెలో పాఠాలు బోధిస్తున్న ఎంఈఓ వెంకటేశ్వరరావు

ధరూరు: మండల పరిధిలోని గుడ్డెందొడ్డి గ్రామ శివారులోని గురుకుల పాఠశాలలను ఎంఈఓ రవీంద్రబాబు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం, టిఫిన్, స్నాక్స్ పెట్టాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించేలా అవగాహన కల్పించాలన్నారు. మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి వైద్యం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రికార్డులు నమోదు చేయాలి

ధరూరు: మండల పరిధిలోని మన్నాపురం ప్రాథమికోన్నత డీసీఈబీ కార్యదర్శి ప్రతాప్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరులో భాగంగా ముఖ గుర్తింపుపై ఆరా తీశారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, ఎప్పటికప్పుడు రికార్డులు అప్‌డేట్ చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మురళీధర్, ఉపాధ్యాయులు ప్రకాష్, అస్లాం, సునీత, ఫర్హానా బేగం, సీఆర్పీ నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

కేటీదొడ్డి: ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని మండల విద్యాధికారి వెంకటేశ్వరరావు అన్నారు. మండల పరిధిలోని గువ్వలదిన్నె, కేటీదొడ్డి పాఠశాలలో ఎంఈఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యతతో కూడిన మధ్యాహ్న భోజనం అందించాలన్నారు. అనంతరం పలు రికార్డులు పరిశీలించారు. గువ్వలదిన్నె పాఠశాలలో స్వయంగా గణితం, ఇంగ్లిష్ పాఠాలు బోధించారు.

సమాచార బోర్డుకే.. సమాచారం లేదు


సమాచార హక్కు చట్టం బోర్డుపై గత అధికారుల పేర్లు తొలగించని వైనం

మానవపాడు: సామాన్యునికి వజ్రాయుధం లాంటి చట్టమైన సమాచార హక్కు చట్టానికి అధికార యంత్రాంగం తూట్లు పొడుస్తోంది. అధికారులు మారుతున్నా సమాచార హక్కు చట్టం తెలిపే వివరాలు బోర్డులో పేర్లు మాత్రం మారడం లేదు. ఏళ్లు గడుస్తున్నా బోర్డు మీద వివరాలు మాత్రం మార్చడం లేదు. మండలంలోని పల్లెపాడు గ్రామంలో సోమవారం 'సాక్షి' విజిట్‌లో చేయగా.. గ్రామ పంచాయతీ కార్యాలయంలో పౌర సమాచార అధికారి ఆంజనేయులు, అప్పిలేట్ అధికారి జి. రమణరావు పేర్లు మూడు సంవత్సరాలుగా అలాగే కొనసాగిస్తున్నారు. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బ్యాంకు సేవలపై అవగాహన ఉండాలి


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

కేటీదొడ్డి: ప్రతి ఒక్కరికి బ్యాంకు సేవలపై అవగాహన ఉండాలని తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంకు మేనేజర్ వికాస్‌రతన్ అన్నారు. సోమవారం మండలంలోని కొండాపురం గ్రామంలో జన సురక్ష క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా పీఎంఎస్‌బీవై తదితర ఇన్సూరెన్సులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సైబర్ నేరగాళ్ల వలలో పడకుండా తెలియని లింక్‌పై క్లిక్ చేయవద్దన్నారు. ఓటీపీ, ఏటీఎం నంబర్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ మోసాలపై 1930కి సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎఎస్‌టీ కౌన్సిలర్లు అనూష, ప్రకాష్, వీరేష్ పాల్గొన్నారు.

ఘనంగా ఎంపీ జన్మదిన వేడుకలు


ఇటిక్యాలలో పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

ఇటిక్యాల/ఎర్రవల్లి/ధరూరు: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ మల్లు రవి జన్మదిన వేడుకలు సోమవారం ఇటిక్యాల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ రాధిక ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ ముబీనా తబసుమ్, నాయకులు జోగుల రవి, శాంతన్న తదితరులు పాల్గొన్నారు.

☆ ధరూరు మండల కేంద్రంలోని వైఎస్సార్ చౌరస్తాలో మండల కాంగ్రెస్ నాయకుడు డీఆర్ శ్రీధర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో హనుమంతు, వాహీద్, వసీం తదితరులు పాల్గొన్నారు.

☆ ఎర్రవల్లి మండల పరిధిలోని బీచుపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో ఎంపీ జన్మదినం సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వెంకటేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

స్నేహితురాలికి రూ.లక్ష ఆర్థిక సాయం



అయిజ: ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న స్నేహితురాలిని ఆదుకున్నారు సింధనూరు జెడ్పీహెచ్ఎస్ 1999–2000 బ్యాచ్‌కు చెందిన పూర్వపు విద్యార్థులు. సింధనూరు చెందిన పాషాబేగం భర్తను కోల్పోయి ముగ్గురు పిల్లలను పోషించలేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్న తరుణంలో విషయం తెలుసుకున్న స్నేహితులు సోమవారం పరామర్శించి రూ.లక్ష ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో స్నేహితులు, గ్రామస్తులు పాల్గొన్నారు.